టాటా-అలెప్పీ ఎక్స్‌ప్రెస్ ఇంకొక పావు గంటలో పార్వతీపురం స్టేషన్ చేరుకోబోతోంది.

రైల్లాగే పరుగెత్తుతున్న నా ఆలోచన్లు ఎంతకీ తెగడం లేదు. జీవితంలో నాదొక సుదీర్ఘ ప్రయాణం – స్టేషన్‌లో దిగడానికి ముందు నా గురించి క్లుప్తంగా మీకు చెప్పి తీరాలి!

నాది వెంకటాపురం. పదేళ్ళక్రితం – అప్పు

# అమ్మ



డు నా వయస్సు ఇరవై. డిగ్రీపూర్తయి, తర్వాత చేయబోయే కర్తవ్యం గురించి ఆలోచిస్తున్న టైమది. నాన్నగారు పోయి అప్పటికే మూడేళ్ళు కావొస్తోంది. అమ్మ నాన్నగారి బెంగనుంచి ఇంకా పూర్తిగా కోలుకున్నట్టులేదు.

ఉన్న ఐదెకరాల పొలాన్ని మావయ్య చూస్తు న్నాడు.

ఇంట్లో నేనొక్కడ్నే. ఇంటి చుట్టూ ఖాళీ స్థలం, ఇంటిముందు కుడివైపున బూరుగు చెట్టు, అందంగా కుదుర్చుకున్న పెంకుటిల్లు మాది. ఊరంతా బంధువులు, స్నేహితులు. అమ్మ నన్ను ప్రేమగా చూసుకునేది. అప్పుడ ప్పుడూ అమ్మతో జరిగే కురుక్షేత్రంలో నన్ను చితకబాదేది.

ఓరోజు -

పక్క ఊరులో 'చింతామణి' నాటకం చూ డ్డానికి స్నేహితులతో కలిసి రాత్రిపూట అమ్మతో చెప్పకుండా వెళ్ళిపోయినందుకు - మర్నాడు నన్ను అమ్మ కోపంతో తన్ని, బయటకు తోసి గేటు గెడవేసింది.

అంతే! అమ్మమీద కోపగించి, ఎక్కడెక్కడో తిరిగి తిరిగి ఇలా ఈరోజు అమ్మకోసం జ్ఞాప కాల తీగల్ని లాక్కుంటూ అమ్మ దగ్గరకి చేరు కోబోతున్నాను. ఊర్లో కనిపించే అందరికీ నేను చెప్పే జవాబు ఏమిటో నాకే తెలియడంలేదు.

"ఇన్నాళ్లూ ఎక్కడ ఉన్నావు? ఏం చేశావు? ఎందుకు రాలేదు? అమ్మను అలా వదిలెళ్ళి పోవడమేనా?" అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపిస్తే?... చెప్పేటందుకు నాదగ్గర మాటలు లేవు. బిత్తరపోతూ అలా చూస్తుండిపోవాల్సిం దే! స్థిరమైన జవాబు నా గుండెల్లోంచి ఉరకడా నికి రెడీగా లేదు.

ట్రైను పార్వతీపురం స్టేషనులో ఆగింది. ట్రైను దిగి, స్టేషనంతా కలియజూసి బయ టికి వచ్చాను.

చుట్టూ ఉన్న వాతావరణం అమ్మమ్మలా కనిపించింది. అప్యాయంగా పలకరించినట్టు అన్పించింది.

వెంకటాపురానికి రిక్షా బేరమాడి ఎక్కాను. అప్పట్లో రెండ్రూపాయలు ఇచ్చేవాళ్ళం. ఇప్పు డు పదిహేను రూపాయలు అడిగాడు.

రిక్షా మెల్లగా ముందుకు కదిలింది.

రిక్షాతో పాటే నా మనసులో తీగలు మెది లాయి.

అమ్మ గుర్తొచ్చింది. నన్ను చూసి భోరున ఏడ్చేస్తుంది. పిచ్చిది! ఇన్నాళ్లూ ఎలాగడిపిందో? నాలాంటి కొడుకు ఏ తల్లికీ పుట్టకూడదు. పుట్టి నా, ఏ తల్లికీ ఇలాంటి పుత్రశోకాన్ని కల్గించ కూడదు. తల్లిలో అంతర్లీనంగా ఉన్న ప్రేమని గ్రహించాలికానీ, పైపైన తిట్టే తిట్లకు మొండి కేసి ఇలాంటి పన్లు చేయకూడదు.

కానీ అప్పట్లో ఈ గ్రహింపు వచ్చేది కాదు. తిడితే తిట్టిందనే అనుకునేవాడ్ని. ఇప్పుడు - ఊరిజనం సంధించే బాణాలకి ఎదురు నిలవ లేను. అమ్మ కన్నీటికి ఆనకట్ట కాలేను. వెన్నలా కరిగే ఆ గుండెల ముందు రాతిలా నిలబడలేను.

అయితే అయిందిలే! అమ్మంటే ఏమిటో జీవితంలో తెలిసొచ్చింది. అమ్మకున్న విలువే మిటో స్పష్టంగా తెలిసింది.

రిక్షా ఊర్లోకి అడుగుపెట్టింది.

ఊరు చాలా మారిపోయింది. పెంకుటిళ్ళ న్నీ పోయి, డాబాలు పుట్టాయి. ఇళ్ళముందు మొక్కలుపోయి, డాబాలపై ఏంటినాలు మొలి

**ఉండవిల్లి ఎమ్.**

చాయి. మా ఊరు నాగరికరెక్కలు తొడుక్కుని, ఇప్పుడిప్పుడే ఎగరడం నేర్చినదాన్లా ఉంది.

ఇళ్ళను పోల్చుకోలేకపోయాను. మనుషు ల్ని సరిగ్గా గుర్తుపట్టనంతగా మారిపోయారు.

ఆనవాలుగా మా ఇంటి దగ్గర ఆపి చూసా ను. తాళం వేసి ఉంది. పైగా డాబాగా మారిం ది. నాకేం అర్థం కాలేదు.

ప్రక్కింటి కాంతం పిన్ని నన్ను చూసి గబ గబా గేటు తీసుకొని రోడ్డుమీదకు వచ్చి, నన్ను ఇంట్లోకి తీసుకుపోయింది.

“బాగున్నావా పిన్నీ!” అని అడిగి, “అమ్మే దీ?” అన్నాను.

“అమ్మ గుమ్మలక్ష్మీపురం మావయ్య వాళ్ళిం టికి వెళ్ళింది. మీ మావయ్య వాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు. రాత్రికో, రేపో వచ్చేస్తుంది” అంది.

నన్ను గదిలో కూర్చోబెట్టి వెళ్లి ‘టీ’ తెచ్చి ఇచ్చింది.

నన్నుచూసి కళ్ళ నీళ్ళు తెచ్చుకుని, మా ఊరెనుక సెలయేటి నీరయింది. మెల్లగా ఈ కబురు అందరికీ అందింది. ఒక్కొక్కరూ వచ్చి, నన్ను పరామర్శించి వెళ్తున్నారు. జన్మతః పల్లె టూర్లో పుట్టడం మూలాన ఆప్యాయతకి, ప్రేమ కీ నోచుకున్నా, అవి కూడా వాళ్ళు ధరించిన టెంపరరీ ముసుగుల్లా కన్పించాయి.

నేను వచ్చినట్టు మిత్రులకి కబురుపెట్టాను. కానీ ఎవరూ ఇక్కడలేరు, సూరిగాడు తప్ప. ఉద్యోగాల కోసం, జీవన భృతికోసం అందరూ వలస వెళ్ళిపోయారు. మిల్లులో పనిచేసి సూరి గాడు రెండు కాళ్ళూ పోగొట్టుకున్నాడని తెల్సిం ది. వాడింటికి నేనొస్తున్నానని కబురు పెట్టాను.

మా ఊర్లో నా ఈడు ఆడవాళ్లకి పెళ్ళి ళ్ళయి, పిల్లలతో ఉన్నారు. కొంతమంది భర్త లతో వాళ్ళ ఊర్లు వెళ్ళిపోయారు. కన్పించిన వాళ్ళెవరూ నావైపు చూసి, నన్ను పలకరించ లేదు. బహుశా వాళ్ళప్రక్క భర్తలుచేరి, ఒక లాంటి భయం, కట్టుబాటు గుర్తొచ్చి అలా దూరంగా ఉండి పోతున్నారేమో అన్పించింది.

చిన్నప్పుడు మా మావయ్యగారి అమ్మాయి తో ఇంటి ముందు తొక్కుడు బిళ్ళ ఆడేవాళ్ళం. ఎప్పుడూ మావయ్యగారి అమ్మాయి మందాకి నితో నేను ఓడిపోయేవాడ్ని. మందాకినిని నాకే ఇచ్చి పెళ్ళి చేస్తాననేవాడు మావయ్య. మందా కిని కూడా నన్నే పెళ్ళిచేసుకుంటాననేది. ఇప్పు డు ఎలాఉందో? ఎవరితో పెళ్ళయిందో? నేనే వాళ్ళ ఆశల్ని వమ్ముచేసి, నీరుగార్చాను.

అప్పటి స్నేహానికి, ఇప్పటి కొంచెం పెద్దరి కానికీ మధ్య అడ్డు గోడలేవో ఆడస్నేహితులకీ మాకూ ఏర్పడినట్టు స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

సూరిగాడి ఇంటికి వెళ్ళాను. మిత్రులందరి గురించి చెప్పి, కాళ్ళు పోయినందుకు భోరున విలపించాడు. నా గురించి పరితపించాడు. నేనంటే వాడికి ప్రాణం. నా బాల్యానికి ఆనవా లుగా మా ఊర్లో వాడొక్కడే ఉన్నాడు.

ఊరు మారిపోయింది. మనుషులు మారి పోయారు. నేను చిన్నప్పుడు కోతి కొమ్మచ్చి లాడిన చెట్లేవీ అక్కడ లేవు. నాగరికత ఉచ్చులో నా ఊరు సహజత్వాన్ని కోల్పోయింది. జీవన భృతికోసం ఊర్లో నా స్నేహితులందరూ చెల్లా చెదురయ్యారు.

నా ఊరు నన్ను అనాధను చేసింది. జ్ఞాపకా ల్ని, అప్యాయతల్ని, ప్రేమల్నీ మనుషుల్లోంచి పారద్రోలి, యంత్రాల్ని గుండెలోపేర్చి మా ఊ రొక కృత్రిమరూపాన్ని సంతరించుకుంటోంది. మా అమ్మరాకకు ముందే నా ఊర్ని చూసి వా

గుండె గోదారయింది.

ఇన్నాళ్లూ నేనెక్కడెక్కడో బ్రతికి, ఈరోజు నా ఊరులో అడుగుపెట్టేసరికి ఇదీ నా ఊరి పరిస్థితి!

నేను ఎక్కడికో వెళ్ళిపోయి, కొన్ని సంవత్స రాలు అక్కడే ఉండిపోయి, అప్పట్లాగే నా ఊరిని ఊహిస్తూ, ఈరోజు మార్పుని చూసి తట్టుకో లేక, కొనుక్కుతెచ్చుకున్న అందంలా ఫ్యాన్సీగా కనబడుతున్న మా ఊర్ని చూసాక, నా బాల్యం లోని ఊరులా అన్పించలేదు.

కాంతం పిన్ని ఇంటికి చేరాను. మా అమ్మ ఇంకా వచ్చినట్టు లేదు. బహుశా రేపు ఉదయం వస్తుందేమో!

టైము తొమ్మిది కావొచ్చింది. భోజనం చేసి, చుట్టుప్రక్కల వాళ్లతో కొంతసేపు ముచ్చటించి, నిద్రలోకి జారుకున్నాను.

తెల్లారింది. అన్ని కార్యక్రమాలూ ముగించి, బట్టలు వేస్కుని హాల్లో కూర్చున్నాను - మా అమ్మ మధ్యాహ్నంలోపు రాకపోతే, నేనే బయ ల్దేరి వెళ్ళడానికి.

ఇంతలో చుట్టుప్రక్కల అందరూ వచ్చారు. వచ్చి, మా అమ్మ కాలంచేసి ఐదేళ్ళయిందనే విషయాన్ని మెల్లమెల్లగా చెప్పి, ఓదార్పులు మొదలెట్టారు.

నా కళ్ళలో కన్నీళ్ళు ఇంకిపోయాయి. వ్యధ గా రగిలిన నిజంతో భేటీ పడలేని గుండె వేగం పెరిగింది. నేను బిగుసుకుపోయాను. మాట రావట్లేదు. ఒక అనంతప్రయాణం వైపు నా దృష్టి మరలిపోయింది.

మెల్లగా మరో విషయాన్ని చెప్పారు. "నువ్వు ఇంటికి తిరిగిరావని మీ మావయ్య తన కూతురి పెళ్ళికి మీ ఐదెకరాల పొలం కట్నంగా మీ అమ్మతో రాయించుకున్నాడు" అని.

నేను స్తబ్ధతగా ఉండిపోయాను. తండ్రి లేని సమయంలో తల్లిని విడిచిపెట్టి వెళ్ళడం ప్రాయ శ్చిత్తానికి చోటులేని పాపం. జీవితంలో ఇదొక్క పాపం చాలు! జీవిత చరమాంకం వరకూ వెంటాడి వెంటాడి తరుముతూనే ఉంటుంది. అసలు ఈ భయంకర జ్ఞాపకాల్ని త్రోసిపుచ్చి నేను మనశ్శాంతిగా బ్రతకగలనా?

"చాలా టైమయింది. లేచి కొంత ఎంగిలి పడు బాబూ" అన్నారు.

నేను నా సూట్‌కేసు తీసుకున్నాను.

అందరూ అడిగారు "ఎక్కడికని?"

"నేను వచ్చిన దారినే వెళ్ళనీయండి" అన్నా ను.

ఏం మాట్లాడాలో తెలియక చూస్తుండిపో యారు అందరూ.

అమ్మపోయాక, అమ్మలాంటి ఊరు మారి పోయాక, ప్రేమలేని మనుషుల్లోంచి, చెట్లమీద కోయిలకూతలు పోయి, ఫ్యాక్టరీ గొట్టాల్లోంచి సైరన్‌లు మ్రోగుతూ, నాగరికత పులుముకుం టున్న ఈ ఊర్లో ఉండి, పాత జ్ఞాపకాల్ని రేపు కుంటూ బ్రతికేకన్నా తెలియని తనంలో వెళ్ళిన ఇలాంటి కృత్రిమ వాతావరణానికే అలవాటు పడిన ఆ ఊరే మేలు.

నాకెందుకో భయం వేసింది. మనిషి క్రమం గా అస్వాదించగల మార్పుని ఒక్కసారే అను భవిస్తే గుండెపగిలి ఛస్తాడని.

ట్రైన్ జాలిగా కూసింది.

స్టేషన్లో అందరూ నిలబడి వీడ్కోలు చెబుతు న్నారు. నేను నా గుండెని అక్కడే మరిచాను. జీవితానికి సరిపడా జ్ఞాపకాల్ని నావెంట తీసు కెళ్తున్నాను. ●